క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన



కోటవురట్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పటిష్టంగా చేస్తున్నట్టు జోనల్ అధికారి రమణ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రూట్ ఆఫీసర్ నరసింహరావు, హెచ్ఎం పరిమళ, సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

యలమంచిలి : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి గ్రామానికి చెందిన అన్నం వెంకటరమణ ఏటికొప్పాక గ్రామం నుంచి 8 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్టు అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ సన్నిబాబు పేర్కొన్నారు.

స్పందనలో ఫిర్యాదుల పరిష్కారం



కైలాసపట్నంలో ఎండార్స్‌మెంట్ లెటర్ అందిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సోమవారు పలు సచివాలయాలను సందర్శించి గతంలో అందిన ఫిర్యాదులకు సంబంధించి ఎండార్స్‌మెంట్‌లు సోమవారం అందజేశారు. కైలాసపట్నంలో చిటికెల తాతబ్బాయి అనే వ్యక్తి 2022 డిసెంబరు 21న పింఛనుపై ఫిర్యాదు చేయగా అతని రేషన్‌కార్డులో అతని కుమారుడు ప్రభుత్వ ఉద్యోగిగా వివరాలు ఉండడంతో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో స్ప్లిటింగ్ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. ఇందుకు సంబంధించి ఎండార్స్‌మెంట్ పత్రాన్ని అతనికి అందజేశారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



మునగపాక సచివాలయాన్ని సందర్శిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. సోమవారం సాయంత్రం ఆయన మునగపాక సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు శాతం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికకు సంబంధించి కోడ్ అమలు జరిగేలా చూడాల్సి ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ అర్జీకి సమాధానం అందించాలన్నారు. ఆయన వెంట ఈవో అజయ్‌బాబు ఉన్నారు.

ఘనంగా బాల వీర వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మునగపాక : అరబుపాలెం గ్రామంలో బాల వీర వినాయక సంఘ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు నాని ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సంఘ ప్రతినిధులు శరగడం రామకృష్ణ, బొడ్డేడ గంగాధర్, ఆడారి నీలకంఠారావు, యోగి, పెంటకోట ప్రకాశరావు, బొడ్డేడ సూరి అప్పాకరావు, కొయిలాడ లక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



యలమంచిలిలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు వెళుతున్న విద్యార్థులు

యలమంచిలి : కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య ఇంటర్ మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొక్కిరాపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల గీతాంజలి వాగ్దేవి కళాశాలల్లో జనరల్ కోర్సులు చదువుతున్న సైన్సు విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు వచ్చే నెల 7వ తేదీ వరకు జరుగుతాయని కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలియజేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని విశాఖపట్నం హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న ఆర్ ఐవో కార్యలయంలోని ప్రత్యేక విభాగానికి అనుసంధానం చేశారు. ఎక్కడా మాస్ కాపీంగ్‌కు ఆస్కారం లేకుండా పర్యవేక్షిస్తున్నారు. విడతల వారీగా జరుగుతున్న ప్రయోగ పరీక్షలకు ఎగ్జామినర్‌లను విజయవాడ ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయం నుంచి నియమిస్తున్నారు.

గోర్జి ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

నక్కపల్లి : రేబాకలో బుచ్చిరాజు చెరువులోకి నీరు చేరే గోర్జితోపాటు, రైతులు తమ జీడిమామిడి తోటలకు వెళ్లే రహదారి మార్గాన్ని ఒక భూస్వామి ఆక్రమించి రైతులను తమ పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ నీరజకు ఫిర్యాదు చేశారు. కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో సతీష్, శ్రీను, వరహాలమ్మ తదితరులు మాట్లాడుతూ సీతారామాంజనేయులు అనే వ్యక్తి సర్వే నంబర్ 213, 178లలో నల్లమాటి కొండలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన డీఫారం భూముల్లోకి వెళ్లే మార్గాన్ని మూసి వేశాడన్నారు. ఇలా పేదలకు పంపిణీ చేసిన కొంత డీఫారం భూమిని, దానిని ఆనుకుని ఉన్న జిరాయితీ భూమిని కొనుగోలు చేసి ఇష్టానుసారం ఐరన్ ఫెన్సింగ్ వేశాడన్నారు. దీంతో రైతులు తమ పొలాల్లోకి వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గోర్జిను కబ్జా చేసి ఫెన్సింగ్ వేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎంపీపీ స్కూల్‌కు హెచ్‌పీసీఎల్ వితరణ



ఎంపీపీ స్కూల్‌కు సదుపాయాలు కల్పించిన హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

కోటవురట్ల : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు హెచ్‌పీసీఎల్ అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని ఎంఈవో పి.అప్పారావు అన్నారు. సుంకపూరు ఎంపీపీ స్కూల్‌కు హెచ్‌పీసీఎల్ కంపెనీ రూ.2 లక్షలు విలువ చేసే బెంచీలు, కుర్చీలు, బీరువాలు ఇతర వస్తువులను వితరణగా అందజేసింది. కంపెనీ ప్రతినిధులు ఎ.చిరంజీవి, కె.బిందుసాయి, కృష్ణంరాజు వాటిని పాఠశాలకు సోమవారం అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలను నాడు–నేడు ద్వారా అద్భుతంగా అభివృద్ధి చేస్తోందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యార్థులకు కావలసిన వనరులను అందిస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధికి హెచ్‌పీసీఎల్ వంటి కంపెనీలు తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి ఉపాధ్యాయుడు రమణ, పేరెంట్ కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రాయితీ యంత్ర పరికరాలకు తుది గడువు నేడు



ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై అందిస్తున్న యంత్ర పరికరాలను పొందేందుకు మంగళవారంతో గడువు ముగుస్తుందని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాలకుగాను ఇప్పటికే 13 ఆర్బీకేల్లో సీహెచ్‌సీ గ్రూపులకు ఇప్పటికే రాయితీ యంత్ర పరికరాలు అందజేశామన్నారు. తారువ, ఎం. అలమండ, కలిగొట్ల, తెనుగుపూడి, మామిడిపల్లి, పెదనందిపల్లి, కాశీపురం ఆర్బీకేల పరిధిలోని సీహెచ్‌సీ గ్రూపులకు అందించాల్సి ఉందన్నారు. ఈ పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూపు రైతులకు రూ.15 లక్షలు విలువ చేసే యంత్ర పరికాలు అందజేస్తామన్నారు. వీటిలో రూ.7.50 లక్షలు గ్రూపు సభ్యులు చెల్లించాలని, రూ. 7.50 లక్షలు బ్యాంక్ రుణంగా అందజేస్తారన్నారు. యంత్రలు పరికాలు అందజేసిన తర్వాత 40 శాతం ప్రభుత్వ సబ్సిడీని గ్రూపు సభ్యుల ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈ ఏడు ఆర్బీకేల పరిధిలోని సీహెచ్‌సీ గ్రూపుల సభ్య రైతులు ఈ నెల 28వ తేదీలోపు డీసీసీబీలో యాభై శాతం సొమ్ము డిపాజిట్ చేస్తే అర్హులుగా పరిగణిస్తారన్నారు. ఈ పథకం ద్వారా దుక్కు, దమ్ము సెట్లు, ట్రాక్టర్లు, రోటోవేటర్స్, పవర్ టిల్లర్స్, మల్టీ క్రాప్ కటర్స్ తదితర యంత్ర పరికాలను అందజేస్తారన్నారు.

అసనగిరి, కొత్త సిరిపురంలో పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదన



నాతవరం ఎంఈవో తాడి అమృత్‌కుమార్

నాతవరం: కొండలపైన గిరిజన గ్రామాలైన అసనగిరి కొత్త సిరిపురంలో ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేక గిరిజన పిల్లలు పడే ఇబ్బందులను ఇటీవల కలెక్టరు పర్యటనలో స్వయంగా చూశారన్నారు. ఆయన ఆదేశాలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. సుందరకోట పాఠశాలకు నాడు – నేడు రెండో విడతలో మంజూరైన రూ. 42 లక్షలతో నూతన భవన నిర్మాణాలు ప్రారంభించామన్నారు. రైతు వెంకయ్యపాలెం, ఎ.శరభవరం పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించేందుకు రూ. 42 లక్షలు చొప్పున, పి.జగ్గంపేటలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనం నిర్మాణానికి రూ. 16 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు చేయకపోతే ఆ నిధులు ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తామన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు 586 మంది విద్యార్థులు రాస్తారని, నాతవరంలో ఒకటి, యర్రవరంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

1న ముకుందపురంలో సీతారాములు తీర్థం

మాడుగుల రూరల్: ముకుందపురంలో ఈ నెల ఒకటో తేదీన సీతారాములు తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెమ్మే వెంకునాయుడు, సర్పంచ్ కర్రి గణేశ్, ఉప సర్పంచ్ టి. శివకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ముగ్గులు, బైక్ స్లో పోటీలు, మధ్యాహ్నం క్విజ్ పోటీలు, సాయంత్రం కె.జె.పురం వారి శ్రీకృష్ణ కోలాటం నిర్వహించనున్నామన్నారు.

ఘనంగా కర్రి రామునాయుడు తీర్థం

కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో కర్రి రామునాయుడు విగ్రహం వద్ద తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు.

తోటాడలో నేడు గంగ పరదేశమ్మతల్లి పండగ

మునగపాక : మండలంలోని తోటాడలో మంగళవారం గంగ పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

24 గంటల హరినామ సంకీర్తన



పులపర్తి నూకాలమ్మవారి ఆలయంలో హరి భజన చేస్తున్న భక్తులు

యలమంచిలి : పులపర్తి గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ మూడో వార్షికోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద 24 గంటల హరినామ సంకీర్తన నిర్వహించారు. 24 గంటలు పాటు నిర్విరామంగా ఏకాహం నిర్వహించారు.దీంతో ఆ పరిసరాలు హరినామంతో మారుమ్రోగాయి. వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. టీటీడీ భజన బృందం సభ్యులు గోపాలకృష్ణ, సత్తిబాబు, ఈశ్వరరావు ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది.

ఎమ్మెల్సీని గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలి



చిన్నగుమ్ములూరులో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



పెదగుమ్ములూరులో గ్రాడ్యుయేట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి కానుకగా ఇవ్వాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు. చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఓటు హక్కు కలిగిన గ్రాడ్యుయేట్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలన్నారు. ఇప్పటికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుంటే మరింత అభివృద్ధి సొంతం చేసుకోవచ్చన్నారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతి రాజు, దంతులూరి వేణురాజు, యేజర్ల సీతారామరాజు, మైలారు శ్రీనివాసరావు, పినపాల ప్రసాద్, మామిడి చంటి, జిల్లా మత్స్యకార సంఘ మాతా గురునాథరావు, ఎస్.రాయవరం కోఆపరేటివ్ బ్యాంకు చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ‘తర్ల’ అమలు పై పరిశీలన



నక్కపల్లి పాఠశాలలో తర్ల కార్యక్రమం అమలు తీరు తెలుసుకుంటున్న శంకర్

నక్కపల్లి : మండలంలో గల వివిధ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల తర్ల ప్రోగ్రాం టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ (టీఏఆర్ఎల్) అమలు తీరును కార్యక్రమం జిల్లా పరిశీలకుడు శంకర్ సోమవారం నక్కపల్లి హెచ్‌సీ ప్రాథమిక పాఠశాల, ఉపమాక ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. కరోనా సమయంలో ఒకటో తరగతిలో చేరి చదువు నేర్చుకోవడంలో నష్టపోయిన విద్యార్థులకు సరళ పదాలు, గుణింత పదాలు చదవడం, రాయడం రాని విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయలేని విద్యార్థులకు గుణింతాల చార్టు అంకెల, సంఖ్యల చార్టులు మొదలగు సాధనాలతో బోధించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రారంభ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రూపులుగా విభజించి వారికి బోధించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ధారాళంగా చదవడం చతుర్విధ ప్రక్రియలు చేయడం కోసం అనేక కృత్యాల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ అమలు తీరును పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. పై పాఠశాలల్లో విజిట్ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని కొనియాడారు. ఆయన కూడా విద్యార్థులకు అనేక కృత్యాలు బోధించారు.

కొండలు పిండి చేస్తున్నారు...



పాటిపల్లి రెవెన్యూలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం

మునగపాక : మండలంలోని పలు చోట్ల రాత్రి వేళల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులు కొండలు తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కల్పిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పాటిపల్లి పంచాయతీలో గ్రావెల్ తరలిపోతుంది. ప్రతి రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు 3.30 గంటల వరకు ప్రొక్లెయిన్‌ల సహాయంతో కొండలను పిండి చేస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అక్రమ తవ్వకాలను నిరోధించాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాటిపల్లి పంచాయతీ గొల్లపేట సమీపంలోని వాటర్ ట్యాంక్ దరి, అలాగే నల్లమారమ్మ గుడి సమీపంలోని చెరువులోనూ, త్రిమూర్తుల ఆలయ సమీపంలోనూ, మోడల్ స్కూల్ దరి చిన్నోడుపాలెం వద్ద రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు జోరుగా సాగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

గొర్రెలు, మేకల విక్రయాల జోరు

- కొత్త అమావాస్య ముందు ఊపందుకున్న గిరాకీ
- కోస్తాంధ్ర నుంచి భారీగా తరలివస్తున్న మేకలు, గొర్రెలు



కొనుగోలు చేసిన మేకలు, గొర్రెలను వ్యాన్లలో తరలిస్తున్న వ్యాపారులు



తాళ్లపాలెం సంతకు అమ్మకానికి తీసుకొచ్చిన మేకలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు జోరందుకున్నాయి. గత వారం వరకు అమ్మకాలు కాస్త స్తబ్దంగా ఉన్నాయి. కొత్త అమావాస్య జాతర సమీపిస్తుండటంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. ధరలు కూడా కాస్త పెరిగాయి. దీంతో పెంపకందార్లు, రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోస్తాంధ్ర నుంచి భారీగా జీవాలు

తాళ్లపాలెం వారపు సంతకు పూర్వపు విశాఖ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకల పెంపకందార్లు ప్రతి వారం వస్తుంటారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆయా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, హోటళ్ల నిర్వాహకులు, మందలుగా మేపుకునే పెంపకందారులు వస్తుంటారు. వీటిని కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకు వెళుతుంటారు. దసరా, సంక్రాంతి, కొత్త అమావాస్య, తదితర పెద్ద ఉత్సవాలతోపాటు గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తారు. అయితే సంక్రాంతి తర్వాతి నుంచి గత వారం వరకు గ్రామాల్లో చెప్పుకోదగిన పెద్ద ఉత్సవాలు లేవు. దీంతో డిమాండ్ లేక గొర్రెలు, మేకల అమ్మకాలు తగ్గాయి. సంతకం వీటి రాక కూడా తగ్గింది.

మందలుగా కొనుగోళ్లు

అయితే వచ్చే నెలలో జరగనున్న కొత్త అమావాస్యకు జిల్లాలో జాతరలు నిర్వహించడానికి దాదాపు ప్రతి గ్రామంలోను గొర్రెలు, మేకలు వినియోగిస్తారు. దీంతో వీటికి గిరాకీ ఏర్పడుతోంది. కొందరు ముందుగానే వీటిని కొనుగోలు చేసి ఉత్సవాలకు సిద్ధం చేస్తారు. ఈ నేపథ్యంలో సంతకు సుమారు వెయ్యి వరకు గొర్రెలు, మేకలు అమ్మకానికి వచ్చాయి. జీవాల సైజ్, వయసు ఆధారంగా రూ.3 వేల నుంచి రూ. 20 వేల వరకు అమ్మకాలు సాగాయి. ఒక్కొక్కదానికి గత వారం కంటె రూ.2 వేలు ధర అదనంగా పెరిగిందని వ్యాపారులు తెలిపారు. వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు వీటిని కొనుగోలు చేసి ఆటోల్లోను, వ్యాన్లలో తమ ప్రాంతాలకు తరలించుకు వెళ్తున్నారు. కొందరు జీవనోపాధి కోసం గొర్రె, మేకల మందలను కొనుగోలు చేశారు.

ఎరువు కోసం మంద కొనుగోలు

ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో ఖరీఫ్ పంటలు వేసే వరకు పంట భూములు ఖాళీగా ఉండటం వల్ల మేతకు అనువుగా ఉంటుంది. కొందరు రైతులు కూడా తమ భూముల్లో సారం కోసం గొర్రెలు, మేకల మందలను ఖాళీగా ఉన్న భూముల్లో ఏటా ఎరువు కోసం రాత్రి వేళ నిలుపుతారు. ఇందు కోసం కొందరు మందలను కొనుగోలు చేస్తారు. అలాగే మందలో మేకలుగాని, గొర్రెలు గాని ఎదిగిన తర్వాత కుటుంబ అవసరాలకు అమ్ముకుంటాం. ఇప్పుడు మేపుకోవడానికి రూ.2.5 లక్షలు ఖర్చు చేసి గొర్రెల మందను కొనుగోలు చేశా.

– ఈగల సతీష్, కట్టుబోలు

జనుము సాగు.. భూసారం బాగు

- పచ్చిరొట్ట, విత్తనాల కోసం రైతుల సాగు
- మండలంలో 170 ఎకరాల్లో రబీ సాగు



కశింకోట వద్ద సాగు చేస్తున్న జనుము పంట సాగు

కశింకోట : మండలంలో భూమి సారవంతం కోసం పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జనుము పంట జోరుగా సాగవుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో రైతులు దీని సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం సుమారు 170 ఎకరాల్లో పంట సాగువుతోంది. సాధారణంగా ఖరీఫ్ వరి సాగు చేసే ముందు పచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగపడటానికి దీన్ని సాగు చేస్తారు. మొక్కలు ఏపుగా ఎదిగిన తర్వాత దమ్ములో కలియ దున్నుతారు. ఇది కుళ్లిపోయి భూమి సారవంతమై, పంటకు సహజ సిద్ధమైన ఎరువుగా ఉపయోగపడుతుంది. అలాగే పిల్లి పెసర, జీలుగు పంటలను కూడా సాగు చేసి పచ్చిరొట్ట ఎరువుగా వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం ఆదాయం వస్తుండటంతో జనుం రబీ పంటగా కూడా సాగు చేపట్టారు. ఇది ఎక్కువ పెట్టుబడి పెట్టే అవసరం లేకుండా అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది.

మూడు నెలల్లో పంట

ఖరీఫ్ వరి కోసిన తర్వాత పదునుగా ఉన్న మడిలో నేరుగా జనుము విత్తనాలు జల్లడంతో అవి మొలకలు వచ్చి ఎదుగుతాయి. సాధారణంగా వాటికి భూమిలో ఉన్న పదును సరిపోవడం వల్ల పెద్దగా నీరు అవసరం ఉండదు. అవసరం అయితే ఒకసారి తడి పెడితే సరిపోతోంది. మూడు నెలల్లో జనుము పంట చేతికి వస్తుంది. ఎకరాకు సుమారు రెండు క్వింటాలు పైబడి జనుము గింజలు దిగుబడి వస్తాయని అధికారులు, రైతులు చెప్తున్నారు. వీటిని మళ్లీ విత్తనాలుగా జల్లుకోవడానికి కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం వీటికి డిమాండ్ ఉంది. ఖరీఫ్ వరి సాగుకు ముందు దీన్ని ఎరువుగా ఉపయోగించడానికి ఎక్కువ మంది రైతులు సాగు చేస్తారు. కిలో విత్తనాలు ధర రూ.60 పలుకుతోంది. ఎకరాకు కాయల కోత కూలీ పోయి సుమారు రూ.10 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. దీంతో దీని సాగుపట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు.

వలిసె అందాల జనుము

మండలంలోని కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జెట్టపురెడ్డితుని, గొబ్బూరు, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి, చింతలపాలెం తదితర ప్రాంతాల్లోని ఖరీఫ్ వరి సాగు అనంతరం జనుము పంట వేసి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. మండలంలో సాగవుతోన్న జనుము పంట పూత ఏజెన్సీలోని అరకు ప్రాంతంలో పండించే వలిసె పూలను తలపిస్తోంది. పసుపు రంగు పూలతో నిండి చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. గొబ్బూరు తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్క ఉన్న ప్రాంతాల్లో సందర్శకులు పంట పొలాల్లోకి వెళ్లి సెల్‌ఫోన్లతో ఫోటోలకు దిగుతున్నారు. దూరం నుంచి చూస్తే వలిసె సాగు జరుగుతుందేమోనని భ్రమిస్తాం.

పచ్చిరొట్టతోపాటు విత్తనాలు

మండలంలో ఈ ఏడాది జనుము పంట విస్తీర్ణం ఆశాజనకంగా ఉంది. రానున్న ఖరీఫ్ కోసం భూమి సారాన్ని పెంచుకునేందుకు ఎక్కువగా దీన్ని సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణంలోనే రైతులు కొంత మేర విత్తనాల కోసం పంట పండేవరకు ఉంచుతున్నారు. సుమారు 170 ఎకరాల్లో రబీ సాగులో జనుము పంట వేశారు.

–ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

దేవదాయ భూమి వేలం పాట వాయిదా

మునగపాక: రామగిరి కోదండ సీతారాముల ఆలయ భూమికి సంబంధించి వేలం పాట వాయిదా పడిందని ఈవో పీఎస్‌ఏ మూర్తి తెలిపారు. సోమవారం జరగాల్సిన వేలం పాటకు పాటదారులు ఎవరూ రాకపోవడంతో వేలం పాట వాయిదా వేసినట్టు చెప్పారు.

గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

రోలుగుంట: కొవ్వూరులో ఈ నెల 25న ప్రారంభమైన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. శనివారం చిన తీర్థం, ఆదివారం పెద్ద తీర్థం జరిగాయి. సోమవారం ఉత్సవమూర్తులను మేళతాళాలతో స్థానిక బీటీ రోడ్డు పక్కన చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేశారు.